క్లుప్తంగా

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



కొంకుదురులో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించిన రొంగల పద్మావతి

బిక్కవోలు: కొంకుదురు ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లా మహిళా సంక్షేమ సంఘ చైర్మన్ రొంగల పద్మావతి స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రావణికి మూడో బహుమతి



గీసిన చిత్రం



శ్రావణి

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ శ్రావణి వేసిన చిత్రపటానికి మూడో బహుమతి లభించింది. రిపబ్లిక్ డే సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ 'ఫ్రూట్ ఆఫ్ ది ఇండియన్ కానిస్టెన్సీ' అంశంపై నిర్వహించిన చిత్రలేఖన పోటీలో శ్రావణి వేసిన చిత్రానికి ఈ బహుమతి లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, పీఓ షేక్ మీరాలు తెలిపారు.

ఘనంగా వరాహస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దంపతులు

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద గురువారం ఆదివరాహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు స్వామివారిని దర్శించుకుని హోమం, శిఖర దర్శనంల్లో పాల్గొన్నారు. యంత్రస్థాపన, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ జరిగాక శాంతి కల్యాణం నిర్వహించారు. సామర్లకోట కోలాటం బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం భక్తులకు అన్న సమారాధన చేశారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం

పెదపూడి: మండలంలోని 18 గ్రామాల్లో ఇక నుంచి తూనికలు, కొలతలు కాకినాడ జిల్లా పరిధిలో అమలవుతాయని జి.మామిడాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ద్వారంపూడి వెంకటరెడ్డి, కార్యదర్శి కర్రి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర లీగల్ మెట్రోలజీ కంట్రోలర్ నుంచి బుధవారం ఉత్తర్వులు అందాయన్నారు. గురువారం విలేకరులతో వారు మాట్లాడుతూ గతేడాది జిల్లాల పునర్విభజనలో భాగంగా పెదపూడి మండలం కాకినాడ జిల్లాలో కలిసిందన్నారు. అప్పటి వరకూ పెదపూడి మండలం తూనికలు, కొలతలు తూర్పుగోదావరి జిల్లాలో ఉండేవన్నారు. ఈ సమస్యపై ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కలిశామన్నారు. విషయాన్ని రాష్ట్ర లీగల్ మెట్రోలజి శాఖ దృష్టికి ఆయన ప్రత్యేకంగా తీసుకెళ్లారన్నారు. ఎమ్మెల్యే కృషి ఫలితంగా పెదపూడి మండలం కాకినాడ జిల్లా పరిధిలోకి చేరుస్తూ ఉత్తర్వులు అందాయన్నారు.

నేడు లక్ష్మీనరసాపురంలో గడప గడపకూ..

అనపర్తి: ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటి పరిష్కారానికి నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం లక్ష్మీనరసాపురంలో జరుగుతుందని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సీతానగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేత్ర, దంత, సాధారణ రోగాలకు వైద్య పరీక్షలు చేయనున్నట్టు తెలిపారు. రాజమహేంద్రవరం నుంచి గౌతమీ నేత్రాలయం, లెనోరా దంత వైద్య కళాశాల వైద్య నిపుణులు, సీతానగరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు రోగులకు సేవలందిస్తారని తెలిపారు.



బిక్కవోలు పోలీస్ స్టేషన్ వద్ద చిన్నారులకు మిఠాయిలు పంచుతున్న సీఐ శ్రీనివాస్



పెదపూడి ఎంపీడీఓ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ విజయభాస్కర్



రంగంపేటలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ అమ్మాజీ



సీతానగరం తహసీల్దార్ కార్యాలయం వద్ద జెండా ఎగుర వేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ రాజు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

వాడవాడలా గణతంత్ర వేడుకలు

అనపర్తి: దేశం కోసం స్వాతంత్య్ర పోరాటంలో సమిధలుగా మారిన మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. 74వ గణతంత్ర వేడుకల్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సేంస్థలు, కార్మిక సంఘాల కార్యాలయాలపై త్రివర్ణపతాకం రెపరెపలాడింది. ఈ సందర్భంగా స్థానిక గ్రామ సచివాలయం-1 ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో ముందుగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన గణతంత్ర వేడుకల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, అనపర్తి, రామవరం సర్పంచ్‌లు వారా కుమారి, గిరడా గంగాభవాని, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, వీర్రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ రామరాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు నేతల చిత్రపటాలకు నివాళులర్పించారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ అమ్మాజీ జాతీయ జెండా ఆవిష్కరించారు. పాఠశాలలు, పంచాయతీ, సచివాలయాల వద్ద జెండాను ఆవిష్కరించారు.

బిక్కవోలు: బిక్కవోలు రెవెన్యూ కార్యాలయం వద్ద డిప్యూటీ తహసీల్దార్ డి.సాయిరాం జెండా ఎగుర వేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ జేఏ ఝాన్సీ జెండా ఎగుర వేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ సంఘం చైర్మన్ రొంగల పద్మావతి, వైస్ ఎంపీపీలు బుద్దాల కన్నారావు, పెంకె మంగయ్యమ్మ, ఎంపీటీసీ గొర్రెల భాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. బిక్కవోలు పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ శ్రీనివాస్ జెండా ఎగురవేసి అనంతరం విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం గురించి వివరించారు.



బిక్కవోలు రెవెన్యూ కార్యాలయం వద్ద జెండా ఎగుర వేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ సాయిరాం

పెదపూడి: మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కేతా తులసి, ఎంపీడీఓ పి.విజయభాస్కర్‌లు జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గణతంత్ర దినోత్సవం

మధురపూడి: మండలంలో గణతంత్ర దినోత్సవం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరం విమానాశ్రయంలో ఎయిర్ పోర్టు డైరెక్టర్ ఎస్.జ్ఞానేశ్వరరావు జాతీయ జెడాను ఎగుర వేసి వందనం చేశారు. అనంతరం నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. స్థానిక కోరుకొండ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో, తహసీల్దార్, ఎంఈఓ, వ్యవసాయ శాఖ ఏడీ, ఎస్ఈబీ సీఐ, పోలీసు సర్కిల్ కార్యాలయం, పోలీసుస్టేషన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. మండలంలోని సచివాలయాలు, పీఏసీఎస్, లైబ్రరీ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద గణతంత్ర దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీపీ ఉల్లి వీరవెంకట సత్య సూర్యకుమారి, ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏడీ బీకే మల్లికార్జునరావు, ఈఓ కుశలవ దొర, ఎయిర్‌పోర్టు ఏజీఎం చిలుకూరి భాస్కర్, రవ్వా భాస్కర్‌రావు, ఈఓపీఆర్డీ బి.మహేశ్వర ప్రతాప్, మండల ఏపీఎం జయంత్రి రాజు తదితరులు పాల్గొన్నారు.



రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జెండాను ఆవిష్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి

రాజానగరంలో...

రాజానగరం: భారత దేశ 74వ రిపబ్లిక్ డే వేడుకలు నియోజకవర్గంలో గురువారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలలో జాతీయ పతాకాలు రెపరెపలాడాయి. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, వందనం చేశారు. ఈ సందర్భంగా రిపబ్లిక్ డే విశిష్టతను తెలియజేశారు. అనంతరం విద్యార్థులు దేశభక్తిని ప్రతిబింబిస్తూ ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

కళాశాలలు, పాఠశాలలో...

గైట్ కళాశాలలోను రిపబ్లిక్ డే వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.లీలావతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డాక్టర్ ఎంవీఎస్ బాబు, డాక్టర్ కె.వల్లీమాధవి, వైస్‌ప్రిన్సిపాల్ ఎస్‌విఎస్‌ఎన్‌మూర్తి, తదితరులు పాల్గొన్నారు. నామవరంలోని భారతీయ విద్యా భవన్‌లోను గణతంత్ర దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. దేశభక్తిని చాటేవిధంగా విద్యార్థులు ఆలపించిన పాటలు, చేసిన నృత్యాలు, ఇచ్చిన సాంస్కృతిక ప్రదర్శనలతో అందరినీ అలరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలకు సెక్రటరీ గోపాలరాజు, హెచ్ఎం దివ్య ధీరేంద్ర, ప్రాంతీయ విద్యా శాఖాధికారి జేఎస్ఎన్ మూర్తి బహుమతులు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలలోను జాతీయ పతాకాలను ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఆవిష్కరించి, రిపబ్లిక్ డే ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.



ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య అశోక్

రంగంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మండవిల్లి గుప్తా సమకూర్చిన బహుమతులను హెచ్ఎం పార్థసారథి చేతుల మీదుగా అందించారు. సుభద్రంపేట పాఠశాలలో వసంత పంచమి వేడుకను సర్పంచ్ కూటి సాయి తాతారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఎంసీ చైర్మన్ ప్రగడ వీరబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు సాయిరాం, హెచ్ఎం హేమలత పాల్గొన్నారు.

గోకవరం: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మూర్తి, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శివనాగబాబు జాతీయ జెండాలను ఎగురవేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ సుంకర శ్రీవల్లీ, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద గురువారం గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఎస్.సత్యనారాయణరాజు గణతంత్ర వేడుకల సందర్భంగా మహాత్మా గాంధీ, డాక్టర్ ఏబీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి, నివాళ్లర్పించి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, ఆర్ఐ లక్ష్మి, వీఆర్వోలు, వీఆర్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి డాక్టర్‌బాబు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు మదర్ థెరిసా సెంటర్‌లో నిర్వహించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న ఆధ్వర్యంలో ముగ్గళ్ళలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోలీస్ స్టేషన్, కస్తూర్బాగాంధీ ఆశ్రమం, సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, పీహెచ్‌సీల్లో గణతంత్ర వేడుకలు నిర్వహించారు.



అనపర్తి గ్రామ సచివాలయం-1 వద్ద జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



రాజమహేంద్రవరం విమానాశ్రయంలో జెండా వందనం చేస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ జ్ఞానేశ్వరరావు

వైభవంగా వసంత పంచమి వేడుకలు



అనపర్తిలో సరస్వతీ దేవి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



సరస్వతీ మాత సన్నిధిలో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు

అనపర్తి: వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం సరస్వతీ దేవి ఆలయాల్లో వసంత పంచమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జ్ఞాన ప్రదాయిని సరస్వతీ దేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక పాతవూరు నల్లకాలువ వంతెన వద్ద గల సరస్వతీ దేవి ఆలయంలో ఆలయ అర్చకులు నాగదేవర వాసుశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. చిన్నారులచే అక్షరాభ్యాసాలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధి పితాని అబ్బులు, రెడ్డి సతీష్, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

రాజానగరం: నియోజకవర్గంలో వసంత పంచమిని గురువారం వేడుకగా జరుపుకొన్నారు. సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేసి, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. రాజానగరంలోని సాయిబాబా ఆలయంలో కొలువైన సరస్వతి మాత విగ్రహం వద్ద కొంత మంది భక్తులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



మల్లంపూడిలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- మల్లంపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మల్లంపూడిలో గురువారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఇంటింటికీ వెళ్లి, గత మూడున్నరేళ్లగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సాయం లభిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెదవెంకన్న, నెడ్ క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ దూలం పెద్ద,మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, నాయకులు అనదాస సాయిరామ్, వేమగిరి కృష్ణ, సర్పంచ్ ముప్పిరిశెట్టి నాగచక్రదొర, ఉపసర్పంచ్ పెంకి దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

భోజనం ప్యాకెట్ల అందజేత



భోజన ప్యాకెట్లు అందిస్తున్న దృశ్యం

సీతనగరం: చినకొండేపూడిలోని శ్రీషిర్డీ సాయిబాబా వసతి మందిరం ఆధ్వర్యంలో దాత వెంకటరమణయ్య(పంతులు) సహకారంతో భోజనం ప్యాకెట్లు అందించారు. గురువారం 150 మంది నిరుపేదలకు ఆ ప్యాకెట్లను అందించారు.

ఉబ్బలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే రాజా



జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: ముక్కినాడలో గురువారం రాత్రి జరిగిన ఉబ్బలమ్మ జాతరలో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పాల్గొన్నారు. అమ్మ వారిని దర్శించుకుని, కొద్దిసేపు జాతరలో పాల్గొన్నారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు అనదాస సాయిరామ్ ఉన్నారు.

ఉత్తమ సేవా పురస్కారాలు

రాజానగరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సూపరింటిండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.సుబ్రహ్మణ్యంతోపాటు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ జి.అగస్టీన్‌కుమార్, వెలుగు ప్రాజెక్టు ఏపీఎం హేమనాగలక్ష్మిలకు ఉత్తమ సేవా పురస్కారాలు వరించాయి. గణతంత్య్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరు కె.మాధవీలత నుంచి ఈ అవార్డులను అందుకున్నారు. వెలుగు ప్రాజెక్టులో 18 సంవత్సరాల సర్వీసు కలిగిన హేమకు ఇది 8వ అవార్డు కావడం విశేషం.

సేవలకు మెచ్చి.. పురస్కారమిచ్చి..

పెదపూడి: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పెదపూడి ఎస్సై పి.వాసుకు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆ అవార్డును కాకినాడలో కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ ఎం.రవీంద్రబాబు, జాయింట్ కలెక్టర్ ఇలక్కియ చేతుల మీదుగా స్వీకరించారు. ఆయనకు ఏఎస్సై శ్రీనివాసు, ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

బిక్కవోలు: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు అవార్డులను తహసీల్దార్ పోసిబాబు, బిక్కవోలు ఎస్సై పి.బుజ్జిబాబు, పందలపాక సచివాలయం-1 సర్వేయర్ కె.ఉదయరాజ్ అందుకున్నారు. రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసా ప్రతాలు పొందారు.





కలెక్టర్ కృతికా శుక్లా, జిల్లా ఎస్పీ రవీంద్రబాబు చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న ఎస్సై వాసు, సుబ్రహ్మణ్యం, అగస్టీన్‌కుమార్, హేమనాగలక్ష్మి

మధురపూడి: బూరుగుపూడి సచివాలాయానికి చెందిన డిజిటల్ అసిస్టెంట్ టి. వెంకట్ ప్రసాద్‌కు ఉత్తమ సేవా అవార్డు గురువారం అందించారు. కలెక్టర్ కె. మాధవీలత చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఎంపీడీఓ పీఎస్ నరేష్‌కుమార్, తహసీల్దార్ పాపారావు అభినందించారు. నల్లజర్ల, అనపర్తి సచివాలయాలకు చెందిన సిబ్బందికి అవార్డు దక్కింది.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు అభినందన

సీతానగరం: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు గుర్తింపుగా అవార్డులు ప్రదానం చేశారు. గురువారం రాజమహేంద్రవరం పేరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా ఎంపీడీఓ కె.రమేష్, ఎంఈఓ కె.స్వామినాయక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోలా హరేరామకృష్ణ, ప్రాథమిక ఆరోగ్యకేంద్ర కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పి.రాధాకృష్ణ, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ జి.చంద్రశేఖర్ ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. వీరిని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష, ఆయా కార్యాలయ అధికారులు, సిబ్బంది, పార్టీ నాయకులు అభినందించారు.











కలెక్టర్ మాధవీలత చేతుల మీదుగా అవార్డులు అందుకున్న ఎంపీడీఓ రమేష్, ఎంఈఓ స్వామినాయక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కోలా హరేరామకృష్ణ, బిక్కవోలు ఎస్సై బుజ్జిబాబు, వెంకట్

ట్రస్టు సేవలు అభినందనీయం

కడియం: క్రీడలను ప్రోత్సహిస్తున్న పల్ల వెంకన్న చారిటబుల్ ట్రస్టు సేవలు అభినందనీయమని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. ట్రస్టు ఆధ్వర్యంలో కడియపులంక టీఎస్ఎం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ టోర్నీని ఏర్పాటు చేశారు. ఈ టోర్నీని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్‌తో కలిసి గురువారం జక్కంపూడి రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా జక్కంపూడి, చందనలు ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కొద్దిసేపు బ్యాడ్మింటన్ ఆడారు. రెండు విభాగాలుగా జరుగుతున్న ఈ పోటీల్లో ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన క్రీడాకారులకు పోటీపడుతున్నారు. మూడు రోజుల పాటు టోర్నీ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ట్రస్టు ప్రతినిధులు, ఐఎస్ఏ మాజీ అధ్యక్షుడు పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల వెంకటేష్, నర్సరీ రైతులు తిరుమలశెట్టి బాబు, ఈలి బేబి, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, నాయకులు పాల్గొన్నారు.

షార్ట్‌ఫిలిమ్స్‌తో మంచి గుర్తింపు

సినీ కమెడియన్ డాక్టర్ భద్రం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): షార్ట్‌ఫిలిమ్స్ ద్వారా ప్రతి ఒక్కరికీ నటుడిగా ఎదిగేందుకు మార్గం లభిస్తుందని సినీ కమెడియన్ డాక్టర్ భద్రం పేర్కొన్నారు. స్థానిక ప్రకాష్‌నగర్ లేడీస్‌క్లబ్‌లో గోదావరి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'కళాకారుల ఆత్మీయ కలయిక' కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం గోదావరి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరించారు. ఇన్స్పిరేషన్ షార్ట్‌ఫిలిమ్‌ను రిలీజ్ చేసి, అసోసియేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులను అందించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సీతానగరం: అత్యవసర పనుల కోసం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఏఈ చంద్రమోహన్ తెలిపారు. సీతానగరం, రఘుదేవపురం ఫీడర్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంట వరకూ విద్యుత్‌ను నిలిపివేస్తామన్నారు. రఘుదేవపురం, రాపాక, చినకొండేపూడి, సీతానగరం, సింగవరం పంచాయతీ నాగరత్నం కాలనీ, లంకభూముల్లో సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

అనపర్తి: కుతుకులూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రామవరం ఫీడర్‌లో లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని రామచంద్రపురం ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో రామవరం గ్రామంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

తాగునీటి పైపులైన్ ఏర్పాటు

బిక్కవోలు: విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చడానికి బిక్కవోలు జిల్లా ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో పైపులైన్ నిర్మించినట్లు హెచ్ఎం పైడిరాజు తెలిపారు. గురువారం ఆ పాఠశాల ఆవరణలో మాట్లాడుతూ గ్రామానికి చెందిన శ్రీవెంకటేశ్వర ప్లాస్టిక్స్ అధినేత పాలచర్ల రామకృష్ణచౌదరి, మానవతా సంస్థ నిర్వాహకులు రామచంద్రరావు సంయుక్తంగా రూ.40 వేలతో బోరు వద్ద నుంచి ఆర్వో ప్లాంట్ వరకు పైపులైను ఏర్పాటు చేయించారన్నారు.